www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 18 డిసెంబరు 2024
5
చిత్తూరు



నెల రోజుల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి: కమిషనర్



ఇళ్ల నిర్మాణాలపై సమీక్షిస్తున్న ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగర పాలక పరిధిలో చేపడుతున్న 'ఎన్టీఆర్ మన ఇల్లు' గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ఇన్‌ఛార్జి కమిషనర్ ఎంఈ వెంకట రామి రెడ్డి హౌసింగ్ అధికారులు, అమినిటీ కార్యదర్శులను ఆదేశించారు. నగరపాలక కార్యాలయంలో హౌసింగ్ పురోగతిపై మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కమిషనర్ మాట్లాడుతూ..కలెక్టర్ ఆదేశాల మేరకు నగర పాలక పరిధిలోని హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ప్రధానం గా ఇప్పటికే రెంటల్ లెవల్స్ వరకు పూర్తి చేసిన గృహాలను నెల రోజుల్లో జనవరి 15వ తేదీ కల్లా పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులను సమన్వ యం చేసుకొని పనులు సాగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ ప్రత్యేక అధికారి కె హరినాథ్ రెడ్డి, ఈఈ నాయక్, ఏఈ శ్రీధర్, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిబంధనలు నిల్!

- సమయం పాటించని షాపులు
- యథేచ్ఛగా విక్రయాలు
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు
- పచ్చని సంసారాల్లో చిచ్చు

ప్రజాశక్తి -విజయపురం : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో బెల్ట్ షాపు దందా జోరుగా సాగుతోంది. అధిక ధరలకు బెల్టు యాజమాన్యాలు జేబులు నింపుకునేందుకు నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసుకున్న బెల్ట్ షాపుల్లో తెల్లవారుజాము నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. ఉదయం 10 గంటలకు తెరవాల్సిన మద్యం దుకాణం 9.19 గంటలకే తెరుస్తున్నారు. అయినా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగా పచ్చని సంసారాల్లో చిచ్చు రగిలి విచ్చిన్నం అవుతున్నాయి.

సంసారాల్లో మద్యం చిచ్చు

విచ్చలవిడిగా గ్రామాల్లో దొరుకుతున్న మద్యం పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతోంది. ఊరూరా బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. దీంతో పొద్దంతా పని చేసి సంపాదించిన సొమ్మును మద్యానికి వెచ్చిస్తూ కుటుంబాలను వీధిన పడేస్తున్నారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తుండటంతో యువత పెడదారి పడుతోంది. ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు విపిస్తున్నాయి.

మత్తుకు యువత బానిస

గ్రామాల్లో గల్లీగల్లీకో బెల్ట్ షాపు వెలుస్తుండడంతో యువకులు మద్యానికి అలవాటు పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. అప్పులు చేసి మరి అధిక ధరకు మద్యాన్ని కొనుగోలు చేసి ఇబ్బందుల పాలవుతున్నారు. బెల్ట్ షాపుల్లో వేకువజామున మద్యం దొరుకుతుండడంతో మండల వ్యాప్తంగా ఈ దుస్థితి నెలకొంది.

స్పందించని అధికారులు..

గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు సాగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. నిబంధనలు ప్రకారం ఉదయం 10 గంటలు తర్వాతే షాపులు తీయాల్సి వున్నా 9.19 గంటలకే తెరచి విక్రయాలు సాగిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారుల ప్రోత్సాహంతోనే గ్రామాల్లో మద్యం విక్రయాలు, మద్యం షాపులు సమయ పాలన పాటించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అడ్డూ అదుపు లేకుండా అక్రమంగా మద్యం విక్రయాలు సాగుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్సైజు అధికారులు వెంటనే స్పందించి నిబంధనలు పాటించని మద్యం షాపులపై చర్యలు తీసుకుని నియంత్రించాల్సి వుంది.



ఉదయం 9.20 గంటలకే విక్రయాలు సాగిస్తున్న మద్యం షాపు

కుశస్థలిలో పడిన కార్మికుడు

- సాహసంతో రక్షించిన యువకుడు
- అభినందించిన అధికారులు



కొట్టుకుపోతున్న కార్మికుడిని తాళ్లతో రక్షించేందుకు ప్రయత్నిస్తున్న యువకులు
కార్మికుడిని రక్షించిన యువకుడిని అభినందిస్తున్న అధికారులు (ఇన్‌సెట్‌లో)

ప్రజాశక్తి -విజయపురం, నగరి: కుశస్థల నదిలో ఓ కార్మికుడు బైక్‌పై వెళుతూ ప్రమాద వశాత్తు పడిపోయి కొట్టుకు పోతుండడం చూసి ఓ యువకుడు సాహసించి తాళ్లతో రక్షించి ప్రశంసలు పొందిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. కుశస్థలి నది వంతెనపై బైక్‌పై వెళుతున్న కార్మికుడు చిట్టిబాబు ప్రమాద వశాత్తు పడిపోయి నీటి ప్రవాహంలో చిక్కుకున్నాడు. తమిళనాడు, పళ్లిపట్టు తాలుకా కొళత్తూరుకు చెందిన చిట్టిబాబు కీళపట్టు శివారు లోని ఒక ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. మంగళవారం యధావిధిగా పనికి బయలుదేరిన ఇతను రోజువారీ వెళ్లే కీళపట్టు తోతట్టు వంతెనపై వచ్చాడు. అప్పటికే అక్కడ వంతెనపై నదినీరు ప్రవహిస్తోంది. అయినా ధైర్యంచేసి బైక్‌లో వంతెనపై ప్రయాణించాడు. కొంతదూరం వెళ్లేసరికి నీటిప్రవాహం ఎక్కువ కావడంతో అదుపుతప్పి బైక్‌తోపాటు నది నీటి ప్రవాహంలో చిక్కుకుని ప్రమాదంలో పడ్డాడు. దూరం నుంచి ఇది గమనించిన కొందరు యువకులు పరుగున అక్కడకు వచ్చి తాళ్లు విసరడంతో నదిలో కొట్టుకుపోతున్న చిట్టిబాబు తాడును పట్టుకున్నాడు. అప్పటికే సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అందరూ కలసి తాడు లాగుతూ అతన్ని పైకి తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. అతను పైకి రావడానికి ఇబ్బంది ఎదురుకావడంతో శేఖర్ అనే తిరుత్తణికి చెందిన యువకుడు నదిలో దూకి ఈదుకుంటూ అతని వద్దకు వెళ్లి అతన్ని ఒడ్డుకు ఈడ్చుకువచ్చాడు. దీంతో బతికి బయటపడ్డాడు. బైక్ నదినీటిలో కొట్టుకుపోయింది. అప్పటికే అక్కడికి చేరుకున్న తహశీల్దారు రవికుమార్, ఎంపీడీవో సతీష్, సీఐ మహేశ్వర్ వంతెనపై నీటిప్రవాహం ఉన్నా అటువైపు ప్రయాణించిన చిట్టిబాబును మందలించారు. అతడిని కాపాడడంలో సాహసం చేసిన శేఖర్‌ను అభినందించారు.

రెండు నెలల్లో కృత్రిమ అవయవాలు పంపిణీ

విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక శిబిరంలో కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 17 నుండి 24వ తేదీ వరకు విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులకు ఉపకరణాల నమోదుకు నిర్వహిస్తున్న ప్రత్యేక గుర్తింపు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని, పేర్లు నమోదు చేసుకున్న వారికి రెండు నెలల్లో కృత్రిమ అవయాలు పంపిణీ చేస్తామని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. భారత ప్రభుత్వ సంస్థ అలిమ్‌కో ద్వారా జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులకు ఉపకరణాల నమోదుకు చిత్తూరు పిసి ఆర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన శిబిరాన్ని కలెక్టర్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం చిత్తూరు జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధులకు సహాయ జీవన పరికరాల పంపిణీ కోసం జిల్లా యంత్రాంగం, భారత ప్రభుత్వం సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖ సౌజన్యంతో కృత్రిమ అవయవాల తయారీ సంస్థ(అలిమ్‌కో)కాన్పూర్ సహాయ శిబిరాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ శిబిరాలలో భాగంగా డిసెంబర్ 17న మంగళవారం చిత్తూరు పిసిఆర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభించిందన్నారు. 18వ తేదీ బుధవారం ఎస్‌ఆర్‌పురం జెడ్పి హైస్కూల్, 19వ తేదీ గురువారం పూతలపట్టు జెడ్ పి హైస్కూల్, 20న శుక్రవారం నగరి పి సి ఎన్ ప్రభుత్వ బాలుర హైస్కూల్ ,21న శనివారం పుంగనూరు వేంకటేశ్వర టెంపుల్ వెనుక గల బి ఆర్ ప్రభుత్వ హైస్కూల్ ,22న ఆదివారం పలమనేరు జెడ్ పి హైస్కూల్ , 23న సోమవారం కుప్పం ఆర్‌టిసి బస్ స్టాండ్ వద్ద వున్న రాజవారి పార్క్, 24వ తేదీ మంగళవారం రామకుప్పం జెడ్‌పి హైస్కూలులో శిబిరాలు నిర్వహిస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పెన్షన్లు తీసుకునే వికలత్వం వున్నవారు, 95 శాతం చెవుడు ఉన్నవారికి కృత్రిమ వినికిడి యంత్రాలను, ఒక కాలు ఉండి ఒక కాలు లేని వారికి వారి కాళ్లకు సరిపడా కొలతలు తీసుకుని వారికి రానున్న రెండు నెలల లోపు కృత్రిమ కాళ్లను ఉచితంగా అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయన్నారు. ఇక్కడికి వచ్చిన అందరి సమస్యలు తెలుసుకుని ప్రతి ఒక్కరికి మేలు చేకూరేలా చర్యలు చేపడతామని, ఈ కార్యక్రమానికి ప్రత్యేక ప్రతిభావంతులు పెద్ద సంఖ్యలో రావడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమం జిల్లాలో మరో 9 రోజులు కొనసాగుతుందని, అంగవైకల్యం కలిగిన వారు ఈ శిబిరాల వద్దకు వెళ్లి వారి పేరు, వారి సమస్యను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ శిబిరాలలో చేతి కర్రలు, వాకర్లు, మూడు కాళ్ల చేతి కర్రలు, నాలుగు కాళ్ల చేతి కర్రలు, వాకర్స్, చంక కర్రలు, వీల్ చైర్లు, చెవి వెనుక ధరించే వినికిడి యంత్రాలు, బ్యాటరీ ట్రై సైకిల్, మూడు చక్రాల సైకిళ్లు , రోలేటర్స్, యంఎస్ కిట్స్, అంధుల చేతి వాచ్, అంధుల చేతి కర్రలు, టచ్ ఫోన్, వాయిస్ ఫోన్, ఎల్ బో క్రచస్, బార్లైన కుష్టు వ్యాధి గ్రస్తులకు లోప్రేసి కిట్లు, డైసి ప్లేయర్, యంయస్ఐడి. కిట్స్, స్మార్ట్ కెన్ కృత్రిమ అవయవాలు, వివిధ రకాల ఉపకరణాల పంపిణీకి గుర్తిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడి శ్రీనివాస్, నగర మేయర్ అముద, డి ఆర్ ఓ కె మోహన్ కుమార్, చూడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, డిఆర్‌డిఏ పీడీ శ్రీ దేవి, చిత్తూరు ఆర్‌డిఓ శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విభిన్న ప్రతిభావంతుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : కుప్పం పట్టణం కొత్తపేటలోని షికారి కాలనీ వాసులు గత కొద్ది రోజులుగా తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారు సమస్య పరిష్కారం కోసం స్థానిక ప్రజా ప్రతినిధులను ఆశ్రయించారు. ప్రజా ప్రతినిధుల ద్వారా సమాచారాన్ని అందుకున్న పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు సమస్యను పరిష్కరించడానికి ముందుకు రావడం పై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పురపాలక సంఘం కమిషనర్ షికారి కాలనీ పరిధిలో నీటి ట్యాంకర్ ఏర్పాటు చేసి స్థానికుల సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, స్థానిక నాయకులు వేలు, సత్యేంద్ర శేఖర్, మాజీ సర్పంచ్ మణి, రవి, మొగల్, షికారి కాలనీ వాసులు పాల్గొన్నారు.



తాగునీటి ట్యాంకర్ ఏర్పాటు చేసిన మున్సిపల్ కమిషనర్

ర్యాంప్ కూల్చివేతపై వైసీపీ నేతల ఆగ్రహం

ప్రజాశక్తి -విజయపురం, నగరి: మండలంలోని దామరపాకం గ్రామంలో వైసిపి నేత గణపతిశెట్టి ఇంటి ముందు వాహనాలు ఎక్కించడానికి కట్టిన ర్యాంప్‌ను అధికారులు మంగళవారం కూల్చివేశారు. ఈ సంఘటనపై మండల వైసిపి నేతలతో పాటు, గ్రామస్థులకు ఆగ్రహం వ్యక్తం చేశారు. గణపతి శెట్టి ఇంటి వద్దకు చేరుకున్న వారు ఆయనకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చిన రోజే స్థానిక టీడీపీ నేతలు గణపతిశెట్టి ఇంటిపై రాళ్లతో దాడి చేశారన్నారు. అంతటితో ఆగక ఆయన కుమారుడు లీలారామ్‌ను, అతనితో పాటు ఉండే స్థానిక యువకులను పలుమార్లు పోలిస్‌స్టేషన్‌కు పిలిపించి వేధిస్తున్నారన్నారు. మంగళవారం కూడా వారిని స్టేషన్‌కు పిలిపించారని ఇంటి యజమానిని అక్కడే ఉంచి గ్రామానికి విచ్చేసిన అధికారులు ర్యాంప్‌ను కూల్చి వేశారన్నారు. గ్రామంలోని వీధుల్లో ఇలా కట్టిన ఇతర ర్యాంపులు ఏవీ అధికారులకు కనిపించలేదన్నారు. ఆక్రమణలు తొలగించాలంటే గ్రామమంతా సర్వేచేసి తొలగించాలిగానీ ఒక్క ఇంటికే తొలగించడం రాజకీయ కక్షసాధింపే అన్నారు. ఇవి కొనసాగితే పూర్తిస్థాయిలో శాంతి భద్రతలకు ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఎదురవుతుందని వైస్ ఎంపీపీ కన్నియప్ప, స్థానిక నాయకులు హరిరెడ్డి, ఉమాపతి, డేనియల్, విజయ్‌రెడ్డి, గురుమూర్తి, మహేష్, తరుణ్, లారెన్స్‌హెచ్చరించారు.

అబాకస్ లో మెరిసిన పీఈఎస్ బుడత



అబాకస్‌లో రాణించిన రిష్విక్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో 1వ తరగతి చదువుతున్న రిష్విక్ ఈనెల 14,15వ తేదీలలో ఢిల్లీలో నిర్వహించిన యూసీమాస్ అబాకస్ ఇంటర్నేషనల్ కాంపిటీషన్‌లో జెడ్ కేటగిరీలో జాతీయ స్థాయిలో 5వ స్థానాన్ని, అంతర్జాతీయ స్థాయిలో 2వ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వైవి కృష్ణ బాబు అబాకస్ యాజమాన్యానికి, బహుమతులను సాధించిన రిష్విక్‌కు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

సౌత్ జోన్ ఫుట్‌బాల్ పోటీకి శిబిరాజ్

ప్రజాశక్తి -విజయపురం, నగరి : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడవ సంవత్సరం బీఎస్సీ చదువుతున్న ఆర్ శిబిరాజ్ ఇటీవల నిర్వహించిన ఇంటర్ కాలేజి గేట్ ఫుట్ బాల్ టోర్నమెంట్లో ప్రతిభ చూపి సౌత్ జోన్ సిటీ ఫుట్ బాల్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. ఈ మేరకు విద్యార్థి ఆర్ సిబిరాజ్ ఈ నెల 21 నుంచి 29 వ తేది వరకు కేరళలోని కాలికట్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టరు వేణుగోపాల్ విద్యార్థి శిబిరాజ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో డిపార్టు మెంటు ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌ఛార్జి డాక్టరు ఎం రెడ్డి నాయక్ , ఫిజికల్ డైరెక్టర్ డివైడి భాస్కర్ పాల్గొన్నారు.



సౌత్ జోన్ పోటీకి ఎంపికైన శిబిరాజ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఇళ్ల స్థలాలు, పట్టాలు కేటాయించండి

కలెక్టర్, ఎమ్మెల్యేలకు తిరువనంపల్లి వాసుల వినతి



ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరుతున్న తిరువనంపల్లి వాసులు

ప్రజాశక్తి- ఐరాల: తమకు ఇళ్ల స్థలాలు, పట్టాలు కేటా యించాలని అధికారు లకు, స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యేకు ఐరాల మండ లం, తిరువణంపల్లి గ్రామ ప్రజలు మంగళవారం విజ్ఞప్తి చేశారు. తిరువనంపల్లి గ్రామం వెనుక వున్న బీసీ కాలనీ వద్ద కొంత స్థలాన్ని చదును చేసి 15 ఏళ్లుగా ఇళ్ల స్థలాల కోసం నిరీక్షిస్తున్నామని , కొందరికి ఈ స్థలం కేటాయించాలని గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు నిర్ణయించి అక్కడ భూమి చదును చేసినా అడ్డుకోవడానికి కొందరు కుట్ర పన్నుతున్నారన్నారు. దీనిపై కలెక్టర్‌కి సోమవారం తప్పుడు సమాచారంతో ఫిర్యాదు ఇచ్చారన్నారు. ఇందులో ఎలాంటి వ్యాపార లావాదేవీలు లేవని, గత 15 సంవత్సరాలుగా ఇళ్ల స్థలాల కోసం ఇబ్బంది పడుతున్న గ్రామ ప్రజలకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతోనే అందరూ సమిష్టిగా నిర్ణయించారని కలెక్టర్, స్థానిక నియోజకవర్గ ఎమ్మెల్యే మురళీ మోహన్, ఐరాల తహశీల్దారు మహేష్, సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై త్వరలో అందరూ కలెక్టర్‌ని, ఎమ్మెల్యే, తహశీల్దారును కలిసి లిఖితపూర్వకంగా విన్నవిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, తిరువనంపల్లి గ్రామస్తులు, గ్రామ పెద్దలు, యువకులు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

ఆగని బియ్యం అక్రమ వ్యాపారం

- పేదలకు పథకమే..పెద్దలకు పైకం..
- తరలిపోతున్న తమిళ బియ్యం..ఆంధ్రానే మార్గం..

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : 'రాష్ట్రంలో మారింది ప్రభుత్వం మాత్రమే..అక్రమ బియ్యం వ్యాపారుల పద్ధతి కాదు..' అంటూ బియ్యం అక్రమ వ్యాపారులను ఉద్దేశించి కుప్పం ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. ఆంధ్ర కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన కుప్పం నియోజకవర్గంలో నిత్యం రేషన్ బియ్యం వ్యాపారం అక్రమార్కుల పాలిట మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది. తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాలకు చెందిన ప్రభుత్వ బియ్యాన్ని కొందరు కర్ణాటక రాష్ట్రానికి ఎగుమతి చేస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటుంటే, మరికొందరు స్థానికంగా రేషన్ బియ్యానికి మెరుగు పెట్టి, సన్న బియ్యం అంటూ అధిక ధరలకు విక్రయిస్తూ వినియోగదారులకు కుచ్చుటోపి పెట్టడమే కాకుండా ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. గత ప్రభుత్వ హయావంలో యదేశ్చగా సాగిన అక్రమ బియ్యం అలవాటు పడ్డ కొందరు నేటికీ తమ వ్యాపారాన్ని కొనసాగిస్తూ, తమ అక్రమ సంపాదనను పెంచుకుంటున్నట్లు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యాన్ని సమాజంలో పెద్దలుగా చెలామణి అవుతున్న వైసిపి నాయకులు అక్రమంగా అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపిస్తున్న పలువురు సామాజిక కార్యకర్తలు పేదలకు ప్రభుత్వ పథకమే కానీ పెద్దలకు మాత్రం పైకం అంటూ విమర్శిస్తున్నారు. ముఖ్యంగా కుప్పం పట్టణం బైరుగానిపల్లి ప్రాంతంలో రైస్ మిల్ నిర్వహిస్తున్న ఆండెప్ప 2019 - 2024 మధ్యకాలంలో అక్రమ బియ్యం వ్యాపారానికి అలవాటు పడ్డట్టు స్థానికులు ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో సైతం పలుమార్లు ఆ రైస్ మిల్ పై ప్రభుత్వ అధికారులు దాడులు నిర్వహించి, ప్రభుత్వ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేసిన సందర్భాలు లేకపోలేదని సమాచారం. ఇది ఇలా ఉండగా మంగళవారం నాడు కుప్పం పట్టణ పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి మరొక మారు ఆండెప్ప రైస్ మిల్ పై దాడులు నిర్వహించారు. ఈ దాడులలో తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాలకు చెందిన సుమారు ఐదు టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఈ దాడులలో ఆర్ ఐ వేణుగోపాల్, పట్టణ ఇన్‌ఛార్జి ఎస్ఐ శ్రీనివాసులు వారి బృందాలతో పాల్గొన్నారు.



రైస్ మిల్లుపై దాడి చేసి పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

ఉద్యోగాల పేరుతో మోసం

దంపతుల అరెస్ట్




పోలీసుల అదుపులో నిందితులు

ప్రజాశక్తి -బంగారుపాలెం: సాఫ్ట్‌వేర్ కంపెనీలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల ఇప్పిస్తామని ఆశావాహులైన యువతీ, యువతకులను మభ్యపెట్టి సుమారు 45 లక్షలు వారి వద్ద వసూలు చేసి ఉద్యోగాలు ఇప్పించకుండా మోసం చేసిన దంపతులను అరెస్ట్ చేశామని సిఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని నల్లంగాడు కోటూరు చెందిన నంత కుమార్ భార్య చెరుకూరి పావని, లక్ష్మణ స్వామి కుమారుడు నంత కుమార్ గ్రామంలో నివసిస్తున్నారు. తమిళనాడు తిరువన్నమలై జిల్లా తేంద్రం, తాలూకా సిరిపాకం చెందిన వ్యక్తి నంత కుమార్ నల్లగాడు కోటూరు గ్రామంలో పావనిని వివాహం చేసుకొని స్థానికంగా నివసిస్తున్నాడు. కోటూరు గ్రామానికి చెందిన కె భరత్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం అతడిని సంప్రదించాడు. అతని నుండి 45 లక్షలు నగదును డిమాండ్ చేయగా నగదు నిచ్చి ఉద్యోగం కోసం ప్రయత్నిస్తుండగా నంత కుమార్ అతని భార్య పావని వాయిదాలు చెప్తూ కాలం వెళ్లదీస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టగా మంగళవారం పోలీసులు ఆ దంపతులు ఇద్దరినీ అదుపులో తీసుకుని విచారించారు. కేసుగా నమోదు చేసి విచారణ చేపట్టారు. యువత సాఫ్ట్‌వేరు ఉద్యోగాల పేరిట మోసం చేసిన చెరుకూరి పావని ఆమె భర్త నంత కుమార్‌ను మంగళవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

రక్త హీనత లేకుండా చూడాలి

- గర్భిణులు, యుక్త వయసు బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి
- వైద్య సిబ్బందికి జిల్లా వైద్యశాఖ టాస్క్‌ఫోర్స్ బృందం ఆదేశం

ప్రజాశక్తి -సోమల: గర్భిణస్త్రలకు, యుక్త వయసు బాలికక్షారోగ్య సంరక్షణపై శ్రద్ధ వహించి రక్త హీనత లేకుండా చూడాలని జిల్లా వైద్యశాఖ టాస్క్‌ఫోర్సు సిబ్బంది వైద్యాధికారులను ఆదేశించారు. సోమల మండలంలోని 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్‌ఫోర్సు బృందం సభ్యులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 81 చిన్న ఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో నిర్వహిస్తున్న వైద్య సేవలపై గర్భిణులు, యుక్తవయసు బాలికల రక్త పరీక్షలు, ఆరోగ్య పరిస్థితులు, తదితర అంశాలను అక్కడే ఉన్న రోగుల వద్ద అడిగి తెలుసుకున్నారు. అనంతరం 'మాతా శిశు సంరక్షణ కార్డులను పూర్తిగా రాశారా?' అని తనిఖీ నిర్వహించి పూర్తి స్థాయిలో మిగిలిన రికార్డులనూ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తహీనత ఉన్న వారికి ఏ విధంగా రక్తం అభివృద్ధి చెందుతుందో అందుకు తీసుకోవాల్సిన పౌష్టికాహారాలు పాలు, పండ్లు, ఆకుకూరలు తదితర ఆహార పదార్థాలపై అవగాహన కల్పించి వారిలో రక్తహీనత లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి జార్జ్, ఎన్‌మెచ్‌ఎం ప్రోగ్రాం అధికారి రామ మోహన్, పిఎంఎంవివై శాఖ అధికారి మంజునాథ్, సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జయసింహ, సిహెచ్‌ఓ అమరనాథ్, ఏఎన్‌ఎంలు వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్సు బృందం

ఘనంగా షర్మిల పుట్టిన రోజు వేడుకలు


కేక్ కట్ చేస్తున్న నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రమేష్ బాబు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు : గంగాధర నెల్లూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి రమేష్ బాబు ఆధ్వర్యంలో పిసిసి అధ్యక్షురాలు షర్మిల 51వ పుట్టినరోజు వేడుకలు ఎంపీడీవో కార్యాలయం సమీపం లోని వైయస్ఆర్ విగ్రహం వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బబ్లెట్ రవి, ఉమేష్, సర్పంచ్ లలిత భాస్కర్, సుబ్బరాయులు, మునికృష్ణ, విజయ్ వేలు, జయచంద్రన్, చంద్రబాబు, కన్నన్, జ్యోతినాథ్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు ముమ్మరం


తాగునీటి పరిశీలిస్తున్న ఈవోపిఆర్‌డి రాజేంద్రన్

ప్రజాశక్తి- విజయపురం : విజయపురం మండల కేంద్రం, దళితవాడలో సర్పంచ్ జబామేరీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. మంగళవారం జేసీబీ ద్వారా మురికి కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టారు. పేద దిబ్బలు తొలగించారు. మురుగు కాలువ, నీటి కుళాయి వద్ద బ్లీచింగ్ చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించారు. అనంతరం ఈవోపిఆర్‌డి రాజేంద్రన్, సిబ్బంది వాసు తాగునీటి పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఇంటి పరిసరాలల్లో పాత టైర్లు, బాటిల్స్ వుంటే వాటిని తొలగించాలని, పొడి, తడి చెత్తను వేరు చేసి, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు.

తాగునీటి సంఘాల చైర్మన్లు, వైస్ చైర్మన్లకు సన్మానం


సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే థామస్

ప్రజాశక్తి - వెదురుకుప్పం: ఇటీవల నిర్వహించిన తాగునీటి సంఘాల ఎలక్షన్లో ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్లకు మండల టిడిపి కార్యాలయంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. మంగళవారం నియోజక వర్గ పర్యటనలో భాగంగా గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే థామస్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. అందరితో పాటు ఎమ్మెల్యే తెలుగు తమ్ముళ్లు శాలువా కప్పి సన్మానించారు. టిడిపి మండల అధ్యక్షులు లోకనాథరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలో సాగునీటి సంఘాల ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులు క్లైవసం చేసుకోవడం చాలా ఆనంద కర విషయమన్నారు. అందరూ సమిష్టిగా పార్టీ అభివృద్ధి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, నీటి పారుదల సంఘం సభ్యులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మృత్యుంజయేశ్వర ఆలయ హుండీ ఆదాయం రూ.37 వేలు

ప్రజాశక్తి -చౌడేపల్లి: స్థానిక మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన హుండీ లెక్కింపు ద్వారా రూ.37వేల 762 ఆదాయం వచ్చినట్లు పుంగనూరు గ్రూప్ టెంపుల్స్ ఈవో కమలాకర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శశి కుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు రాజశేఖర్ దీక్షితులు, అర్చకులు కుమారస్వామి, మహేష్, స్థానిక దేవాదాయ ధర్మాదాయ శాఖ సిబ్బంది హరిప్రసాద్, పరకామణి సేవకులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలి: ఎంపీడీవో

ప్రజాశక్తి -శాంతిపురం : ఈ నెల 18, 19వ తేదీల్లో శాంతిపురం మండలంలో12 కేంద్రాలలో నిర్వహించనున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కుమార్ మంగళవారం తెలిపారు. ఈ ఆధార్ కేంద్రాలలో విద్యార్థుల అపార్ కార్డుల కోసం నూతన ఆధార్ కార్డుల నమోదు, తదితర ఆధార్ సేవలు అందిస్తారన్నారు. ఈ ప్రత్యేక క్యాంపులను మండల ప్రజలు, పాఠశాల, కళాశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

పెన్షనర్ల అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పెన్షన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక పెన్షనర్ల భవన్ లో ఆల్ ఇండియా పెన్షనర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 17వ తేదీ ఆలిండియా పెన్షనర్ దినోత్సవాన్ని నిర్వహిస్తామని పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు దశరథ నాయుడు, శ్రీరామ్ మూర్తి, రాజారత్నం రెడ్డి, కోదండ నాయుడు, లక్ష్మయ్య , ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

సర్పంచ్ టిడిపిలో చేరిక



ప్రజాశక్తి -వెదురుకుప్పం : వెదురుకుప్పం మండలం బొమ్మయపల్లి సర్పంచ్ కామసాని నవనీతమ్మ ఎమ్మెల్యే థామస్ ఆధ్వర్యంలో మంగళవారం టిడిపిలో చేరారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే థామస్ మండల పర్యటనకు వచ్చారు. ఇందులో భాగంగా దేవళంపేటలో ఎమ్మెల్యే సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఆయన పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన నచ్చడంతోనే ఆ పార్టీలో చేరినట్లు సర్పంచ్ మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.


మౌలిక వసతుల కల్పనతోనే గ్రామాల అభివృద్ధి: ఎంపీడీవో

ప్రజాశక్తి -సోమల: మౌలిక వసతుల కల్పనతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీవో పంచాయతీల పరిధిలోని గ్రామాలలో మౌలిక వసతుల కల్పన ద్వారా గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీవో నారాయణ పేర్కొన్నారు. సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బందికి స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎల్ ఎస్ డి జి) పై రెండు రోజుల శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా మహిళా స్నేహపూర్వక గ్రామం, స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాల కల్పన, సామాజిక న్యాయం సామాజిక భద్రత, సుపరిపాలన, తాగునీరు పారిశుధ్యం వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ లక్ష్మీదేవి, హౌసింగ్ ఏఈ జవీద్ అలీ, ఏపీవో దినకర్ బాబు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. సర్పంచులు, మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ ఇతర సిబ్బందికి పలు అంశాలపై సోమవారం నుండి శిక్షణ ప్రారంభమైంది. మొదటి రోజు శిక్షణకు ఎంపీడీ మగసాల రెడ్డప్ప హాజరై దిశా నిర్దేశం చేశారు. మండల అభివృద్ధి అధికారి రాజేంద్ర బాలాజీ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈఈ లోకనాథం, మండల వ్యవసాయ అధికారి గీతకుమారి, ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి, ఏపీవో హరినాథ్, వెలుగు ఏపిఎం లలిత, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి, రిసోర్స్ పర్సన్ సురేష్ స్థానికీకరణ సుస్థిర అభివృద్ధి పేదరికం లేని, మెరుగైన జీవనోపాధి గ్రామం, తదితరాలపై శిక్షణ ఇచ్చారు.

గుడిపల్లె : గుడిపల్లె మండలంలోని 18 గ్రామ పంచాయతీలు సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలకు ఒక పంచాయతీలో అన్ని రంగాలపై అభివృద్ధి అనే కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. వెలుగు కార్యాలయంలో కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాలైన గ్రామ పంచాయతీలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు, ప్రజలకు సుపరిపాలన అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఇందులో పాల్గొన్న సభ్యులందరికీ పంచాయతీ రాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ ఆన్లైన్ పోర్టల్ ద్వారా ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి గౌరి, ఈఓ, అసిస్టెంట్ ఇంజనీర్ పి.ఆర్.ఐ.ఎ.పి.యం, సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు .

యాదమరి : మండలంలోని గ్రామ పంచాయతీ అభివృద్ధిపై ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించవచ్చని మండల అభివృద్ధి అధికారి వేణు అన్నారు. మంగళవా రం మండల పరిషత్ కార్యాలయంలో గత రెండు రోజులుగా స్థానికీకరణ సుస్థిర అభివృద్ధికి పేదరికం లేని, మెరుగైన జీవనోపాధి ఉన్న గ్రామం, ఆరోగ్యవంతమైన గ్రామం, బాలల స్నేహపూర్వక గ్రామం, నీరు సరిపడ గ్రామం, స్వచ్ఛమైన పచ్చని గ్రామం, స్వయం సమృద్ధి తో కూడిన మౌలిక సదుపాయాలతో కూడిన గ్రామం, సామాజిక న్యాయపరమైన, సామాజిక భద్రత కలిగిన గ్రామం, సుపరిపాలన ఉన్న గ్రామం, మహిళా స్నేహపూర్వక గ్రామం వీటికి సంబంధించిన తొమ్మిది లక్ష్యాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఈవోపిఆర్‌డి సుకుమార్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్, ఈఈ, వెలుగు ఏపీఎం, ఈశ్వరయ్య, ఇన్చార్జి పి ఆర్ ఎ ఈ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, సచివాలయ, సిబ్బంది పాల్గొన్నారు.


యాదమరిలో

పూతలపట్టు అభివృద్ధే లక్ష్యం

సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మురళీ మోహన్


మాట్లాడుతున్న పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్

ప్రజాశక్తి-ఐరాల, యాదమరి: పూతలపట్టు నియోజకవర్గంలో సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా పలు ప్రణాళికలు రూపొందించడానికి ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగిస్తున్నామని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ వెల్లడించారు. మంగళవారం ఉదయం కాణిపాకం ఎల్‌బి కళ్యాణ మండపంలో పూతల పట్టు నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళిక సమీక్షా సమావేశాన్ని చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందు కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ఎమ్మెల్యే మురళీమోహన్ పుష్ప గుచ్చం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఉద్యానశాఖ, ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ శాఖ ఆధ్వర్యంలో సిగ్మెంట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, భూమి పాలిమర్ ప్రైవేట్ లిమిటెడ్ వారు 22 మంది రైతులకు డ్రిప్, స్పింకర్ల పరికరాల సామగ్రిని పంపిణీ చేశారు. 27.61 హెక్టార్లకు రూ. 26.24 లక్షలు వెచ్చించి రూ. 23.61 లక్షలు సబ్సిడీతో లబ్ధిదారులకు కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేలు అందించారు. అనంతరం పూతలపట్టు నియోజకవర్గ అభివృద్ధి, ప్రణాళికపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ 2047 నాటికి ఏపిని అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి ఆశయానికి అనుగుణంగా పూతలపట్టు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ లక్ష్య సాధనకు కలెక్టర్ సహకారంతో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించామన్నారు. ప్రతి గ్రామం, ప్రతి మండల స్థాయిలో శాఖల వారిగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకోవడం, వాటిని అమలు చేయడం ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధిలో రైతులు, యువత, గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం కీలకంగా భావిస్తున్నామన్నారు. ఇందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా, మండల అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

వందశాతం ఫలితాల సాధనే లక్ష్యం: ప్రిన్సిపాల్


సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్య అతిథులు

ప్రజాశక్తి -సోమల: వంద శాతం ఫలితాలు సాధించడమే తమ లక్ష్యమని సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్‌నాయుడు పేర్కొన్నారు. సోమల లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించిన స్టడీ మెటీరియల్‌ను కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ నాయుడు, కళాశాల స్థల దాత కుమారుడు కోటేశ్వరరావు, అధ్యాపక బృందం మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రతి విద్యార్థి పూర్తి స్థాయిలో చదివి పరీక్షలు బాగా రాసి వంద శాతం ఫలితాలు రావాలన్నదే తమ లక్ష్యంగా విద్యార్థులను తీర్చి దిద్దుతున్నామని అన్నారు. సంకల్ప పేరుతో ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు స్టడీ అవర్ నిర్వహిస్తున్నామని ఇందుకోసం ప్రభుత్వం అందజేసిన స్టడీ మెటీరియల్ విద్యార్థులకు అందించారు. ప్రభుత్వం పిల్లల అభివృద్ధి కోసం ఉచితంగా అందజేసిన స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు వచ్చే విధంగా కృషి చేయాలని కోటేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికే సదస్సు

ప్రజాశక్తి -బైరెడ్డి పల్లి: మండల పరిధిలోని దొంతి రాళ్లపల్లి రెవెన్యూ గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తహశీల్దారు మాధవరాజు మాట్లాడుతూ రెవెన్యూ గ్రామాలలో రైతుల భూ సమస్యలు పరిష్కరించడమే రెవెన్యూ సదస్సు ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. రైతులు తమ సమస్యలను రికార్డులతో అర్జీల రూపంలో తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పాత రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. రెవెన్యూ సదస్సుకు 22 వినతులు వచ్చాయని, వాటిని రికార్డులు పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సరిత, వీఆర్వో జయరాం, వీఆర్ఏలు, స్థానిక టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విజయపురం: రెవెన్యూ సదస్సుకు మంచి స్పందన లభిస్తోందని తహశీల్దార్ కిరణ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతులు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులు రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు అశోక్, రెవెన్యూ సిబ్బంది, పలువురు నాయకులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: రీ సర్వే కార్యక్రమంలో జరిగిన తప్పు ఒప్పు లను సరిదిద్దడానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కలెక్టర్ వెంకట శివ అన్నారు. మండలంలోని నందనూరు, వెజ్జుపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశంతో రైతులకు భూముల పరంగా ఉన్న సమస్యలను రెవెన్యూ రికార్డులను పరిశీలించి రైతులకు న్యాయం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్, వెజ్జుపల్లి సర్పంచ్ హరిప్రసాద్ రెడ్డి, ఆర్ఐ ఏకాంబరం , పలువురు వీఆర్వో లు, సచివాలయం అధికారులు పాల్గొన్నారు.

రొంపిచర్ల : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులో భాగంగా మంగళవారం రొంపిచర్ల మండలం బొమ్మయ్య గారి పల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మండల అధ్యక్షుడు, రాష్ట్ర బీసీ కమిటీ ఛైర్మన్ ఉయ్యాల రమణ మాట్లాడుతూ ప్రజలు భూ సమస్యలపై ఆఫీసుల చుట్టూ అధికారుల చుట్టూ సమయం వృథా చేసుకోకుండా ఈ రెవెన్యూ సదస్సులలో ఆన్లైన్, మ్యుటేషన్ భూ పరిష్కార సమస్యలు, వెంటనే అధికారుల సమక్షంలో పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దారు పి కిరణ్ కుమార్, ఆర్ ఐ సుధాకర్ నాయక్, వీఆర్వోలు, విఏఓలు, బొమ్మయ్య గారి పల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సోమల:సోమల మండలం ఎస్ నడింపల్లి పంచాయతీ సూరయ్య పల్లి సచివాలయం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో పలువురు 21 అర్జీలను అందజేశారని వీటిలో భూ సమస్యలు ఇండ్ల పట్టాలు కావాలని అర్జీలు సమర్పించినట్టు తహశీల్దార్ బెన్ను రాజ్ తెలిపారు. వైస్ ఎంపీపీ ప్రభాకర్ రెవెన్యూ సదస్సులో మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలోని బూడిదేటి వారి పల్లి, ఎస్టి కాలనీ, ఎర్రం వారి పల్లి దళిత గ్రామాల ప్రజల సౌకర్యార్థం స్మశాన వాటికలు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమణ, వీఆర్వో రెడ్డి ప్రసాద్ రైతులు ప్రజలు పాల్గొన్నారు.

చౌడేపల్లి: చౌడేపల్లి మండలం పంచాయతీ కేంద్రం గడ్డం వారి పల్లిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 30 మంది రైతులు వినతిపత్రాలు అందించారని డిప్యూటీ తహశీల్దారు మాధవి తెలిపారు. రైతులు వివిధ రకాల భూ సమస్యలపై వినతి పత్రాలు అందించారని వాటిని 43 రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రైతులకు భూ సమస్యలు రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని రాజంపేట టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గాల అధికార ప్రతినిధి వెంకటరమణ సూచించారు. అనంతరం రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశాన్ని రైతులకు వివరించారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు వేలూరు సుబ్రహ్మణ్యం, ఆర్ఐ భారతి, మండల సర్వేయర్ గుణశేఖర్ , వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

త్వరలో భువనేశ్వరి కుప్పం పర్యటన : టిడిపి


మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి, కుప్పం టౌన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ ట్రస్టీ అయిన నారా భువనేశ్వరి త్వరలో నాలుగు రోజుల పాటు కుప్పం నియోజకవర్గ పరిధిలో పర్యటించనున్నారని ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పి ఎస్ మునిరత్నం, తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలి సభ్యులు శాంతారామ్ లు తెలిపారు. మంగళవారం కుప్పం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో పురపాలక సంఘం టిడిపి అధ్యక్షులు రాజ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సతీమణి కుప్పం పర్యటనలో భాగంగా త్వరలో నాలుగు రోజులపాటు నాలుగు మండలాలలో పర్యటించనున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా శాంతిపురం మండల పరిధిలో ముఖ్యమంత్రి నిర్మిస్తున్న ఇంటిని పరిశీలించనున్నారని, అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో సమావేశం కానున్నారని, ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున నిర్వహిస్తున్న డీఎస్సీ శిక్షణ, నైపుణ్యాభివృద్ధి శిక్షణ శిబిరాలను పరిశీలించనున్నట్టు తెలిపారు. ఈ పర్యటనలో ముఖ్యంగా గ్రామ గ్రామాలలో ప్రజలతో మమేకమై మహిళల కష్ట సుఖాలను తెలుసుకుని, వారి అభివృద్ధికి ప్రణాళిక రచించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ అధ్యక్షులు సత్యేంద్ర శేఖర్, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి, యువ నాయకులు మురళి, ఎమ్మార్పీఎస్ కుప్పం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు ఎంపీడీఓ కార్యాలయంలో సీడీపీఓ వినతశ్రీ అధ్యక్షతన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లతో ఇంజనీరింగ్ పనుల నిర్వహణ, అంగన్‌వాడీ సెంటర్‌లలో ఆధార్ సెంటర్ల నిర్వహణపై ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నిర్వహిస్తున్న హౌసింగ్ పనులు, సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల పనులను ప్రతి రోజూ పర్యవేక్షించి, త్వరిత గతిన పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. అంగన్‌వాడీ సెంటర్‌లలో స్పెషల్ డ్రైవ్ ద్వారా ఆధార్ సెంటర్‌లు అంగన్‌వాడీ సెంటర్లలో డిసెంబర్ 17 నుండి 28 వతేది వరకు ఆధార్ స్పెషల్ డ్రైవ్‌లు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని ఆదేశాలు అందాయని అంగన్‌శాడీ వర్కర్లు కేంద్రాల్లో తప్పని సరిగా ఉండాలన్నారు. కొత్త ఆధార్ (బాల ఆధార్) తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్‌పై స్పెషల్ ఫోకస్ చేస్తూ సేవలు అందిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో సీడీపీఓ వినతశ్రీ , ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ ఈశ్వర్ ప్రసాద్, సూపర్ వైజర్ బిందు మాలతి పాల్గొన్నారు.

పరీక్షల తనిఖీ


పరీక్షలను తనిఖీ చేస్తున్న ఎంఈవో లీలారాణి

ప్రజాశక్తి -పలమనేరు: ఒకటి నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్ష టర్మ్- 1 పరీక్షను మండల విద్యాశాఖ అధికారి పి. లీలారాణి మంగళవారం తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ఫిజికల్ సైన్స్, జనరల్ సైన్స్ పరీక్షలను మంగళవారం ఉదయం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల అభ్యాస నైపుణ్య సమపార్జన , విద్యావిషయక విజయానికి మూల్యాంకనం చేయడానికి ప్రభుత్వం ఈ పరీక్షలు నిర్వహిస్తోందన్నారు. 6 ,8 ,10వ తరగతి విద్యార్థులకు ఉదయం 9.15 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు పరీక్షలు జరుగుతున్నాయని ,ఏడు, తొమ్మిదవ తరగతి కి సంబంధించిన విద్యార్థులకు మధ్యాహ్న 1.15 నిమిషాల నుండి 4 గంటల 30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. వర్షం కారణంగా నిలిచిపోయిన పరీక్షలు 12, 13 తేదీలలో జరగాల్సిన ఇంగ్లీషు, గణితం పరీక్షలు ప్రభుత్వం విద్యాశాఖ వాయిదా వేసిందని, ఈ పరీక్షలు తదుపరి ప్రభుత్వం ప్రకటించే ఉత్తర్వుల మేరకు ఆయా తేదీల్లో నిర్వహిస్తామన్నారు. ఈ తనిఖీలో ఆమెతో పాటు సిఆర్‌పి రంజిత్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

ప్రజాశక్తి -శాంతిపురం: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించి లాభాలు పొందవచ్చని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. మండల పరిధిలోని ప్రీతి చామనూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి జి.అప్పోజి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు అధిక లాభాలు వస్తాయన్నారు.ముఖ్యంగా ఘన,ద్రవ జీవామృతం తయారీ విధానం విత్తన శుద్ధి,వివిధ కాషాయాల తయారీ విధానం వాటి ఉపయోగాలు రైతులకు తెలిపారు. రైతులు ఫసల్ బీమా యోజన పథకం ద్వారా పంట ఇన్స్యూరెన్స్ చేసుకునే వారికి ఈనెల 30 తేదీ వరకు అవకాశం ఉందన్నారు. రైతులు పండించిన పంటలకు బీమా చేసుకోవాలని కోరారు.అనంతరం కంది,అనప,మొక్కజొన్న పంటలను పరిశీలించి వివిధ పురుగులు,తెగుళ్ల నివారణ చర్యల గురించి తెలిపారు.ఈ కార్యక్రమంలో వి ఎస్ ఏ నరసింహులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, ప్రీతి చామనూరు రైతులు పాల్గొన్నారు.

మెడికేర్‌ను సమర్థవంతంగా అమలు చేయండి

ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ పౌర-కేంద్రీకత విధానంతో దేశ వ్యాప్తంగా ఉన్న ప్రజల ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను ప్రామాణీకరించడానికి ఉద్దేశించిన ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమమని, దీన్ని సమర్థవంతంగా నిర్వహించాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కోరారు. ఈ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ప్రజలకు ఆరోగ్య సంజీవనిగా పనిచేయడంతో పాటు భద్రత నిస్తుందని పేర్కొన్నారు. ఢిల్లీ పార్లమెంటు సమావేశాలకు హాజరైన చిత్తూరు ఎంపీ, ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ద్వారా ఆంధ్రప్రదేశ్ కు అందుతున్న వైద్య సేవలు, దీని కోసం 2021నుంచి 2024 వరకు ఎన్డీఏ సర్కారు వెచ్చించిన నిధులు, ఏపీకి సంబంధించి, సేవలను సద్వినియోగం చేసుకుంటున్న ఖాతాదారులు ఎంత మంది ఉన్నారు? అన్ని వివరాలు కోరుతూ చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు లేఖ రాశారు. 2021సెప్టెంబర్ 27న ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌ను ప్రారంభించిందని గుర్తు చేశారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ పై ప్రత్యేక దృష్టి సారించి, 4కోట్లా 21లక్షల21వేల726 మందిని భాగస్వామ్యం చేసి, ఖాతాలు తెరిచినట్లు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తన లేఖలో తెలిపిందన్నారు. ఇందు కోసం బడ్జెట్లో 2021 నుంచి 2024 వరకు 500 కోట్ల రూపాయలను కేటాయించి రోగులు, ఆసుపత్రులు, వైద్య నిపుణులు , విధాన రూపకర్తలతో సహా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలోని వివిధ వాటాదారుల మధ్య అంతరాన్ని తగ్గించే బలమైన డిజిటల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను నిర్మించడంపై దష్టి సారించినట్లు కేంద్ర మంత్రి ప్రతాప్ రావు జయదేవ్ తన లేఖలో వివరించారని ఆయన తెలిపారు. ముఖ్యంగా చిత్తూరు జిల్లాలో 33,87,064 మంది, తిరుపతి జిల్లాలో 5,82,573 మంది ఖాతాదారులుగా నమోదై ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ సేవలను పొందుతున్నట్లు కేంద్రమంత్రి తెలిపారని చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల వెల్లడించారు.

క్రైం న్యూస్

మహిళ అనుమానాస్పద మృతి


అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన అనిత

ప్రజాశక్తి-పూతలపట్టు: మామిడి తోటలో మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన పూతలపట్టు మండలం బాటకమంగుటూరు సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు ..గణపతి రెడ్డి భార్య అనిత(41) ఉదయం ఇంటి పనులు చూసుకొని తమ పొలంలోని మిరప చెట్టు కలుపు తీయడానికి వెళ్లింది. పక్క పొలంలో కలుపుతీస్తున్న కొందరు ఇంటికి వెళ్లి పోవడంతో 12 గంటల అయినా ఇంటికి రాలేదని మృతురాలి కుమారుడు పంట పొలం వద్దకు వెళ్లాడు. తల్లిని మామిడి చెట్టుకు కొంగుతో కట్టి వుండటాన్ని గుర్తించి కేకలు వేశాడు. పక్కనే చెరువులో చేపలు పడుతున్న కొందరు యువకులు కేకలు గమనించి సంఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. మహిళ మెడలో ఉన్న బంగారు నగలు అలాగే ఉండడంతో మరికొన్ని అనుమానాలకు దారి తీస్తోంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

లారీలు ఢీ..ఇద్దరు మృతి


మృత దేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-పూతలపట్టు: రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుక వైపు మరో లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన పూతలపట్టు మండలంలోని కొత్తకోట సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలోని పి కొత్తకోట సమీపంలో చిత్తూరు వైపు వస్తున్న లారీ టైర్లు పంచర్ కావడంతో రోడ్డు పక్కన ఆపి పంచర్ వేస్తుండగా ఇదే వైపు వస్తున్న మరో లారీ ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ ముందు వున్న పలమనేరు మండలానికి చెందిన కృష్ణమూర్తి (25) మృతి చెందాడు. వెనుక వైపు లారీలో వున్న ఒంగోలు జిల్లాకు చెందిన సలార్ (50) అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక వైపు లారీలో సలార్ మృతదేహం ఇరుక్కు పోవడంతో పోలీసులు జెసిబిల సాయంతో మృత దేహాన్ని బయటకు తీశారు. ఈ మేరకు పూతలపట్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'కిశోరి వికాసం'తో బాలిక భవిష్యత్తుకు పునాది


మాట్లాడుతున్న ముఖ్య అతిథులు

ప్రజాశక్తి -విజయపురం : కిశోరి వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని సిడిపిఓ కృష్ణవేణి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాక్రమంలో మంగళవారం నిచిన కిశోరి వికాసం కార్యక్రమాన్ని సీడీపీవో కృష్ణవేణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బాలిక భవిష్యత్తును మెరుగుపరచడానికి కిశోరి వికాసం మంచి అవకాశమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీఓల సమన్వయంతో కార్యక్రమం పునఃప్రారంభమైందన్నారు. 11-18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబనను మెరుగుపరచడం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సోమశేఖర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బాలికల సంఘాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించడంతో పాటు, సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్టు చెప్పారు. డిజిటల్ భద్రత, సైబర్ క్రైమ్, ఆన్‌లైన్ వేదికలపై జాగ్రత్తగా ఉండేలా అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో, ఎంపీడీఓ రమణ ప్రకాష్, ఎస్ఐ బలరాం, అంగన్‌వాడీ సూపరువైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు ఏఎన్ఎంలు, మహిళ పోలీసులు పాల్గొన్నారు.

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - గంగవరం : తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా తెలుగు సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్ష కార్యదర్శులు తులసీనాథంనాయుడు, పుష్ప తెలిపారు. మహిళా ఉపాధ్యాయలు తమ ప్రత్యేకతలను పోస్టు ద్వారా ఈనెల 25వ తేదీ లోపు కళామందిరం, గంగవరం చిరునామాకు పంపాలని నైపుణ్యం సాధించిన వారికి బహుమతులతో పాటు పురస్కారాలు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళా ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి శిక్షణ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు ఈనెల 18 ,19 తేదీల్లో నిర్వహిస్తామని ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీధర్ బాబు మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొనాలని మండల కార్యాచరణ ప్రణాళిక 2024-25 పై స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో శిక్షణ ఉంటుందని గ్రామ పంచాయతీ అభివృద్ధి నమూనాలను తెలుపుతారని ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలన్నారు.


ట్రైనీ ఆర్మీ అధికారికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ఆర్మీ అధికారికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : ఇండియన్ ఆర్మీ అధికారిగా శిక్షణను పూర్తిచేసుకుని స్వగ్రామానికి విచ్చేసిన గణపతిని కుప్పం రైల్వే స్టేషన్లో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నరేష్, గుడుపల్లి మండల బిజెపి అధ్యక్షులు రామచంద్ర స్థానిక యువతతో కలిసి ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గ పరిధిలోని గుడుపల్లి మండలం కొడతనపల్లి పంచాయతీ సోలచింతనపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన గణపతి పట్టుదలతో లక్ష్యాన్ని సాధించి భారత సైన్యంలో లెఫ్టినెంట్ అధికారిగా నియమితులు కావడం గర్వకారణమన్నారు. నేటితరం యువత దేశ సేవకు ముందుకు రావడం హర్షించదగ్గ విషయమని, భారత సైన్యంలో సేవలందించాలన్న కుతూహలంతో ఉన్న యువతకు దిశా నిర్దేశం చేస్తూ, వారికి తగిన శిక్షణ అందించడానికి సహకరించాలని గణపతిని బిజెపి నాయకులు, జన సైనికులు కోరారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన లెఫ్టినెంట్ అధికారి స్థానిక యువతకు శిక్షణ అందించడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి -కుప్పం రూరల్ : కుప్పం నియోజకవర్గ పరిధిలో ఇటీవల జరిగిన సాగునీటి వ్యవసాయదారుల ఎన్నికల ప్రక్రియలో గెలుపొందిన నూతన కమిటీ సభ్యులను టిడిపి నాయకులు అభినందించారు. ఇందులో భాగంగా ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం మండల పరిధిలోని బ్రహ్మదేవరచెన్ను గ్రామంలో నూతనంగా ఎన్నికైన కమిటీని సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ చెరువు ఆయకట్ట రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా ముందుండి పోరాడుతామని తెలిపారు.